# మహాగపిల్ల

ఆనాడు జరిగిన సంగతి అంతా చెప్పేముందు నన్ను గురించి కొంచెం చెప్పుకోడం ముఖ్యం.

నా పేరు.... ఆహఁ.... మీరెవరూ చెప్పుకోలేరులెండి. ఎందుకంటె అటువంటి పేరు అసలు మీరు వినివుండ రెప్పుడూ.... నేను బడిపంతులుగా ఉద్యోగంలోచేరేముందు మొదటి రోజున మా హెడ్మాస్టరు నా పేరు విని కళ్ళు పెద్దవిచేసి చూశాడు. నేను అప్పటినుంచి మా బడి పిల్లలకు నా పూర్తి పేరు తెలీయకుండా జాగ్రత్త పడ్డాను. కేవలం యు. ఎ. ఆర్. అనే వ్యవహారిక నామం తప్ప నా పూర్తి పేరు ఎక్కడా బయటికి రాకుండా, తోటి మేష్టర్లకు కూడా తెలీకుండా జాగ్రత్తలు తీసుకున్నాను. కాని కొన్నాళ్ళకు ఎలా తెలిసిందో ఏమో మా డ్రాయింగ్ టీచరొకామె ఒకనాడు నేను నలుగురిలోనూ కూర్చుని వుండగా వచ్చి కొంపలంటుకుపోతున్నట్టు హడావిడిగా "అబద్ధాలరావుగారూ; మీ కోసం ఎవరో వచ్చా

రండీ...." అన్నది. దాంతో అందరికీ నాపేరు వెల్లడి అయింది. అయినా ఈ పేరుకు సంబంధించినంత వరకూ నాబాధ్యత ఏమీలేదు. మా అమ్మా నాన్నలకు (వారి ఆత్మలకు శాంతి లభించుగాక.) పుట్టిన ప్రతివాళ్ళూ పురిట్లోనే పోవడమో, కొన్ని నెలలు పెరిగి పోవడమో జరిగేది. అలా అక్కరకు రాని సంతానం ఎనిమిది మంది కలిగారు. తర్వాత నేను భూమి మీద పడగానే "వీడు మాత్రం బ్రతకబోయాడా...." అని నిస్పృహతో నాకు "అబద్ధాలరావ" ని నామకరణం చేశారు, దీనికి నేనేం చెయ్యగలను చెప్పండి ....నాకు ఊహ తెలిసినప్పటి నుంచి నలుగురూ నా పేరు విని తమాషాగా చూడటంతోనూ, నా పేరు నాచెవులకే యింపుగా ధ్వనించనందువల్లనూ దాన్ని మార్చుకుందా మనుకున్నాను. "ప్రేమకుమార్" అనో "రాకేష్ బాబు" అనో · మరింకేదైనా అందమైన పేరునో పెట్టుకుందా మనుకున్న సమయాలున్నాయి. కాని ఆ తర్వాత లోతుగా ఆలోచించి ఆ ప్రయత్నం విరమించు కున్నాను. ఎవరికీ, ఎక్కడా ఉండని అరుదైన పేరు నాది. ఒక వందపేర్లు పట్టిక వ్రాయండి. పాతికమంది సుబ్బారావులుంటారు. పాతికమంది వెంకటేశ్వర్రావు లుంటారు. మరో యిరవైమంది సత్యన్నారాయణ లుంటారు, పదిహేనుమంది కృష్ణమూర్తులుంటారు. పది మంది విశ్వనాథాలు ఉంటారు. కొందరు అప్పారావులూ, కొందరు సింహాచలాలూ ఉంటారు. కాని అబద్ధాలరావును నేనొక్కణ్ణే ఉంటాను. ఒక్కణ్ణే! అది విశేషంకదూ?

సరే, నా పేరు గొడవతో మిమ్మల్నిక విసిగించను. ఇక దాన్ని అంతటితో వొదిలేసి మిగిలిన వివరాలు మనవిచేస్తాను. నన్ను మీరు చూళ్ళేదు. అయినా అబద్ధాలూ, అతిశయోక్తులూ చెప్పను. నాకు ముప్ఫయి ఎనిమిదేళ్ళు. చామన చాయగా ఉంటాను. ఉంగరాల జుట్టు కాదుగాని అందమైన క్రాపు, అట్టే సన్నగా ఉండను. అట్టే లావుగానూ ఉండను. పోయిన జనవరిలో బెజవాడ రైల్వే ప్లాట్ ఫారం మీది మెషిను

లెక్క ప్రకారం నూట ముప్పయి పౌన్లబరువు....కళ్ళజోడులేదు....గుడ్డలు మాయనివ్వను. క్రాపు చెరగనివ్వను. భగవంతుడు నాకు ఐశ్వర్యం యివ్వలేదు కాబట్టి, మానాన్న నలుగురి నోళ్లూ కొట్టి యింత గడించి పెట్టలేదు కాబట్టి, నేను చాలామామూలు మధ్యతరగతి బడిపంతులును. అయినా నా మిత్రులు మాత్రం మొదటనుంచీ సంపన్నులే. నాకంటె తక్కువ వారితో నేను స్నేహం చెయ్యను. నాకు శుచీ శుభ్రతా లేని మనుషులంటే వొళ్ళు మంట. బురద పనిచేసేవాళ్ళనూ, పిడకలు చేసేవాళ్ళనూ, పేడకోసం గొడ్లవెంట పరుగులెత్తే వాళ్ళనూ, పాకీవాళ్ళనూ, మాసినదుస్తులు ధరించిన వాళ్ళనూ, మడ్డి మనుషులనూ, జడ్డి వెధవలనూ చూస్తే వొళ్ళు మంట. నా పిల్లలను గుమ్మందాటి బయట అడుగు పెట్టనివ్వను. మాఆవిడను సినిమాలకూ నలుగురు చేరే చోట్లకూ వెళ్ళనివ్వను. మాపిల్లలను పొరుగుపిల్లలతో ఆటలాడనివ్వను. మొన్ననే మా పెద్దవాడు పొరుగు పిల్లలతో మట్టిలో ఆటలాడి గుడ్డలు మాపుకుని వచ్చాడని చావగొట్టాను. మాపొరుగింటి పేద యిల్లాలితో (ఆవిడ ఎప్పుడూ మాసిన చిరిగిన చీరెలే కట్టుకుంటుంది.) మాట్లాడినందుకు మాఆవిడను మందలించాను.

ఇదంతాకాక నాకు అడుక్కుతినే వాళ్ళంటే పరమ అసహ్యం. కాని దురదృష్ట వశాత్తూ ఈ దేశంలో అడుక్కుని తినేవాళ్ళ సంఖ్య ఎక్కువగా వుంది. ఏ హోటలుకైనా వెళ్ళండి. ....పర్వదినాలలో ఏ గుడికైనా వెళ్ళండి....లేకపోతే మామూలుగా రోడ్లుమీదకే వెళ్ళండి ....రైలెక్కండి ....ఎక్కడికి పోయినా అడుక్కు తినేవాళ్లే....అదేమి చోద్యమోగాని వందలూ, వేలసంఖ్యలో ఉంటారు. వాళ్ళ మొహాలలో ఆకలి ..ఆకలి..నాకు అడుక్కునే వాళ్ళంటే ఎంత అసహ్యమో వాళ్ళకు డబ్బులు పడేస్తే వాళ్ళంటే కూడా అంతే అసహ్యం....వాళ్ళు ఏదో దయగా తోటి మానవులపట్ల ఔదార్యం చూపిస్తున్నామనీ, సానుభూతిలో వున్నామని అనుకుంటారు. కాని నాకు మాత్రం అలా అనిపించదు. వాళ్ళే ఈభిక్షుకవృత్తిని

ప్రోత్సహిస్తున్నారనీ అడుక్కుతినేవారి సంఖ్యను పెంచుతున్నారనీ, నాకు అనిపిస్తుంది. కాని ఈ దాతలకు తెలియదు. ఆబిచ్చగాళ్ళు అలా పైసలు పైసలు పోగుచేసి రూపాయికి ఎనభై, తొంభై చొప్పున మార్చుకుంటారనీ అలా యింకా లాభాలు కూర్చుకుంటారనీ, వారికసలు తెలీదు. అలాడబ్బు విలువ తగ్గిపోవటానికి తమ దాతృత్వం కారణ మవుతున్నదని వారికి చెప్పినా అర్థంకాదు.

అదంతా సరే....ఆరోజు నేను ఊరికి పోవలసివచ్చింది. చేతిలో సంచీతో బయలుదేరి స్టేషనుకు చేరుకున్నాను. అసలు నాకు ఈరైళ్ళలో బస్సులలో ప్రయాణం చెయ్యాలంటే తలనొప్పి. అంతటాగోలగా, రొదగా వుంటుంది. అసహ్యమైన మనుషులుంటారు. రైళ్ళలోనూ. బస్సులలోనూ, ఆబగా, ఆకలిగా ఏవేవోతింటూ వుంటారు. పెద్దగా అరుచుకుంటూ వుంటారు. ఇదంతా నాకుచిరాకు...అయినా నాకు ఈ ప్రయాణం తప్పలేదు. "ఏకారో వుంటే ఎంత బాగుండును." అని అప్పుడప్పుడు అనిపిస్తూ వుంటుంది. అప్పుడే సిటీబస్సుల్లోనూ, స్టేట్ బస్సుల్లోనూ, రైళ్ళలోనూ, ఈ "డర్టీ ఫోక్"తో కలసి ప్రయాణంచేసే దౌర్భాగ్యం తప్పుతుంది కదా!

నేను యథాప్రకారం సెకండ్ క్లాసు టిక్కెట్టు కొనుక్కుని ఫ్లాట్ ఫారం మీదికి వెళ్ళాను. అటూ యిటూ రైలు పొడుగునా నడిచాను. ఎక్కడా ఏపెట్టెలోనూ ఖాళీలేదు. సెకండ్ క్లాసు పెట్టెలు థర్డుక్లాస్‌పెట్టెల కంటే ఎక్కువ సమ్మర్దంగా వున్నాయి. అయినా ఈ రోజుల్లో అందరికీ హోషు పెరిగింది. తినటానికి కట్టటానికీ లేనివాడు కూడా సినిమాహాళ్ళలో రైళ్ళలో పైతరగతులకే వస్తున్నాడు. ఒకణ్ణి పట్టుకుని చూడండి....వాడికి యింటిదగ్గర తిండి ఉండదు. చాలీ చాలని జీతంరాళ్ళు వస్తాయి. వాడి ఆదాయం పంచెకు తక్కువ, గోచీకి ఎక్కువ అన్నట్లు ఉంటుంది. అందు

కని ప్రతివాడూ ఆదారీచాలని గుడ్డను నెక్ పైగా కట్టుకుని దర్జాగా దిగంబరంగా తిరుగుతున్నాడు.

ఆ రైలు ఒక పెద్ద బెల్లం బుట్టలా వుంది. దాని చుట్టూ లోపలా, పైనా ఈగల్లాగు దోమల్లాగు ముసిరి వున్నారు మనుషులు. చుట్టూ చెవులు బద్దలు చేసేరొద. గందరగోళం, అక్కడే కాపురాలు. పిల్లలు....పిల్లల ఏడుపులు. లోపుడు బళ్ళ వాళ్ళకేకలు. అంతా రణ గొణధ్వని యమలోకంలా వుంది.

నేను ఒక పెట్టలో ఎక్కి చోటు చూసుకుని కూర్చున్నాను. చేతిసంచీ పైన పెట్టేను. ఒక్కసారి నాపక్క వారినీ ఎదుటి వారినీ చూశాను. ఆమూలకిటికీ పక్కనే ఏవరో ముసలాయన కూర్చుని వున్నాడు! ఆపక్కనే ఒక అందమైన పడుచు....పక్కన ఆమె భర్త కాబోలు ఒకయువకుడు. ఆ పక్కన ఒక నడివయసు మనిషి. పక్కన నేను. ఎదురుగా కిటికీపక్కన ప్యాంటు లోపలికి చొక్కాదోపిన ఒకవిద్యార్థి. అతని చేతిలో సినిమా పత్రిక. ఆ విద్యార్థి పక్కనే చేతిలో ఇయాన్ ఫ్లెమింగ్ నవలతో ఒక సూట్ వాలా....ఆపక్కన వృద్ధదంపతులు....

బండి ఎంతకూ కదలలేదు. ఉక్కపోస్తున్నది, చుట్టూ అంతా వేడిగా వుంది. గాలి కదలటంలేదు,

నేను "ఉస్ ....అబ్బబ్బా! బండి ఎంతకూ కదలదే" చెమటతో చస్తున్నాం అన్నాను.

నాపక్కన ఉన్నాయన వాచీ చూసుకున్నాడు. అది చూసి సూట్ వాలాకూడా తన వాచీచూసుకున్నాడు. కిటికిదగ్గరగా కూర్చున ముసలాయన టైమెంతయింది బాబూ! అనిఅడిగాడు. సూట్‌వాలా బదులు పలకలేదు, నాపక్కన ఉన్నాయన "నాలుగుంబావు"....అని చెప్పాడు. అది ముసలా

యనకు వినిపించలేదు. మళ్ళీ "ఎంత?" అని రెట్టించి అడిగాడు. నా పక్క వ్యక్తి మళ్ళీ చెప్పలేదు. తల ఎటోతిప్పి చూస్తూ కూర్చున్నాడు.

అంతలో ఒక మొండి ముష్టివాడు లోపలికి వచ్చి నా మొహం ముందు తన మొండి చెయ్యివుంచి, ఏదో అడగబోయాడు నాకు క్షణంలో వొళ్ళు జలదరించింది నిలువెల్లా కంపరమెత్తి, వెంటనే పెద్దగా కసిగా "ఎవడ్రా నువ్వు? రాస్కెల్ .... ఫో అవతలికి ఫో ముందు" అని అరిచాను. అరిచి వాడి ముఖంలోకి చూశాను. వాడు చెయ్యి వెనక్కు తీసుకుని మళ్ళీ మిగిలిన వారి ముందుకు వెళ్ళబోయాడు. నేను మళ్ళీ "రేయ్.... రోగ్ నీ నీక్కాదురా చెప్పేది? ఇటురాకు ...." అన్నాను. వాడు తెల్లటి పళ్ళు బయట పడేటట్టు నవ్వి "ఆ మారాజుల్ని అడుక్కుంటాను. అయ్యా; అవిటోణ్ణి .... ఒక్క పైసా అంటున్నాడు. నేను, వాడు లోపలికి వెళ్ళటానికి వీలులేకుండా కాలు అడ్డం పెట్టి అక్కడి వాళ్ళందరి తరపునా వాళ్ళెవ్వరూ యివ్వరు. పో పో ముందిక్కడినించీ.... అన్నాను. వాడు ఒక్క క్షణం నిలబడి నాపక్కన ఉన్న వారి వంకా, నా ఎదురుగా వున్నవారి వంకా దీనంగా ఆశగా చూశాడు. నేను వాళ్ళవైపు చూశాను. కాని వాళ్ళలో ఎవరూ కదలలేదు, మెదలలేదు. బొమ్మల్లా కూర్చుండిపోయారు. విద్యార్ధి సినిమా బొమ్మలు చూసినవే మళ్ళీ చూస్తున్నాడు. సూట్‌వాలా జేమ్సు బాండ్ సాహసాల్లో భాగం పంచుకుంటున్నాడు. పడుచు దంపతులలో భర్త ఎటోచూస్తున్నాడు. భార్య ముష్టివాని చేతివంక జూస్తున్నది. చివరకూర్చుని పైసు అడిగిన ముసలాయన గొంతుసరిచేసుకుని జేబులో చెయ్యిపెట్టాడు. నేను వాళ్ళందరి తరపునా వాళ్ళెవరూ పైసాకూడా యివ్వరు అని ధీమాగా చెప్పాను. ఈముసలాయన నా పరువు దక్కనిచ్చేటట్టులేడే అనుకున్నాను. కాని ఆయన అంతసేపూ వెదికి చివరకు జేబులోనించి పొగాకుకాడబైటికి తీశాడు. దాంతో నామనసు తేలిక పడింది. మళ్ళీ మొండి చేతులవాణ్ణి ఉద్దే

శించి "పోరా పో.... ఇక యిక్కడ నిలబడకు" అని అరిచాను. వాడి ముఖంలో ఓటమి కనిపించింది. అవమానంతో వెంటనే వెళ్ళిపోయాడు.

నేను సరిగా కూర్చున్నాను, నావంక చూసిన ముసలాయనతో "అంతేనండి.... వీళ్ళతో యిలాగే వ్యవహరించాలి. మెత్తబడితే లాభంలేదు. ఈ ముష్టివెధవలతో ఎక్కడికి పోయినా యిబ్బందిగానేవుంది. ఈ రైళ్ళలోమరీ అన్యాయం—ఓహ్! ఎన్నిరకాల ముష్టివాళ్ళు—అబ్బబ్బ.... దారుణం.... వీళ్ళకు పైసలివ్వగూడదు. అసలు బండ్లో ఎక్కనివ్వ గూడదు. అదుగో అక్కడ బోర్డుమాత్రం పెద్దదే పెట్టారు. కాని వాళ్ళ రైళ్ళలో ఎక్కిపన టోటి మర్యాదస్తుల మొహాలమీద మొండిచేతులు జూపి అడుక్కుంటూవుంటే పట్టించుకునే నాధుడే లేడు' అన్నాను.

"మరి దీనికి రెమిడీ ఏమిటంటారు?" అని అడిగాడు నాపక్కనున్న ఆసామీ....

నేను కోపంగా "రాస్కెల్స్‌ను.... కనిపించిన వాణ్ణల్లాపట్టుకునికాల్చిపారేస్తేసరి.... పీడావిరగడవుతుంది." అన్నాను.

"అవునండోయ్ మీరు చెప్పింది బాగానేవుంది. ఒక్క దెబ్బకురెండు పిట్టలన్నమాట. జనాభా పెరుగుదల సమస్య కూడా దాంతో దానంతటఅదే వొదిలి పోతుంది." అన్నారెవరో....

తర్వాత నేను ఈ బిచ్చగాళ్ళను గురించీ వాళ్ళకు ధర్మంచేసే అలవాటున్న వారిని గురించి మాట్లాడాను. వాళ్ళుఅడుక్కోటం వంచన అన్నాను. ధర్మం చేసేవారు వంచనను పెంచుతున్నారన్నాను. ఇలా దేశంనిండా సోమరితనం, వంచన, బూటకం, మాయజూదాలు ఎక్కువవుతున్నా యన్నాను. ముష్టి వాళ్ళకు రకరకాల వ్యాపారాలు, వారిపద్ధతులూ విడమరచి చెప్పాను.

అక్కడి వాళ్ళందరూ నామాటలను చాలా శ్రద్ధగా విన్నారు. వారి వైఖరి నామాటలను ఆమోదించినట్టే కనిపించింది. ఉండి ఉండి ఒకరిద్దరు తలలువూపి "అవును సుమండి నిజమే" అన్నారు. ఎదురు ప్రశ్నలు, అనుమానాలు, అడ్డసవాళ్ళూ అసలురాలేదు.

దానితో నేనుగొప్పవిజయం సాధించిన వాడిలా ఫీలైనాను. తర్వాత బండి కదిలేముందు ఒక పాటలు పాడుకునే యువతి మావైపు రావటానికి ప్రయత్నించింది. నేను ఆమెను అటునుంచి అటే మరొక వైపుకు తరిమాను. మరొకడు చేతిలో చిడతలు పట్టుకుని "మేరే మెహబూబ్...." అంటూ వచ్చాడు. వాణ్ణి అలాగే మరోవైపుకు తరిమి కొట్టాను. ఒకకుంటి కాలివాడు డేక్కుంటూవచ్చాడు. వాణ్ణీ హడలకొట్టి వెనక్కువెళ్ళగొట్టాను. బండి కదిలే వేళ అయింది. గంటకొట్టారు. అప్పుడు ఒకసారి మళ్ళీ నా చుట్టూవున్న వారివంక చూశాను. వారు నేను తమకు చేసిన సహాయానికి కృతజ్ఞతతో చూస్తూండటం గమనించాను.

అంతలో బండి కదిలింది. ముందు నెమ్మదిగా, తర్వాత వేగంగా ఫ్లాట్‌ఫారం వీడి పరుగెత్తింది. పచ్చపచ్చని నేల.... చెట్లు, తోపులూ, కనిపించాయి. చల్లగాలి మళ్ళింది.

తర్వాత సూటువాలాతో కొంచెంసేపు సంభాషించాను. ఆయన తాను చదివిన నవలనుగురించి చెప్పాడు. దాంట్లో ముగింపుఎట్లావుంటుందో ఊహించడం బ్రహ్మకైనా సాధ్యం కాదన్నాడు. ఆనవల్లో గొప్పతనం అదేనన్నాడు. సాహిత్యరంగం నాకు బొత్తిగాఅపరిచితం, అందువల్లఅంతా విని గంభీరంగా తలవూపి "జీవితం కూడా అంతే గదండీ. ఏ జీవితానికి ముగింపు ఎలా వుంటుందో ఎవడికి తెలుసు? అందాకా ఎందుకు? ఒక సంఘటన ఎలాముగుస్తుందో చెప్పటం కూడా మనకు చేతకాదు. మానవ మాత్రులం" అన్నాను.

నేను తర్వాత ఒక్క నిమిషం అదేదో చిత్రమైన వేదాంత ధోర ణిలోపడి కళ్ళు మూసుకున్నాను. తర్వాత కళ్ళు తెరిచి చూద్దునుకదా, ఎప్పుడు వొచ్చిందో ఏమో ఒక పన్నెండేళ్ళ పిల్ల నాకన్ను గప్పి లోపలికి వచ్చింది. అప్పటికే నా చుట్టుపక్కల ఉన్న వారందరికి ఏవో కాగితాలు పంచి యిచ్చి నిలబడి వుంది. అప్పటికే వాళ్ళందరూ ఆ కాగితాలు అందు కుని చదువుతున్నారు.

ఆపిల్ల నాకూ కాగితం ఇవ్వబోతే తీసుకోకుండా నా పక్క నున్న నడివయసు వ్యక్తి వంక తిరిగి "ఇలాటి వెన్నో చూశాను. అన్నీ మాయ వేషాలు. ఆకాగితంలో ఆపిల్ల మూగపిల్ల అనీ, దిక్కు లేనిదనీ, తోచిన సాయం చెయ్యమనీ వుంటుంది. ఎవడో తలకు మాసినవాడు కింద సంత కంకూడా చేస్తాడు" అన్నాను.

సూట్ వాలా కళ్ళు పెద్దవిచేసి చూసి "కరెక్ట్....సరిగ్గా మీరు చెప్పినట్టే వుంది ఇక్కడ...." అన్నాడు.

నేనది విని "చూశారా?" అన్నట్టు పోజుపెట్టాను.

అంతలో నా పక్కనున్న ఆయన "అయితే యిది అబద్ధమం టారా?" అని అడిగాడు.

నేను సంకోచించకుండా గట్టిగా "అంతా మాయ....మోసం.... మరేమీకాదు...." అన్నాను

వాళ్ళందరూ ఆ కాగితాలు తిరిగి ఆ పిల్లకు ఇచ్చేశారు. ఎవరూ డబ్బులు ఇవ్వలేదు.

నేను ఒక్క క్షణం ఆగి ఆ పిల్లవంక తిరిగి "ఏయ్! అమ్మాయ్! నిజం చెప్పు. నువ్వు మూగదానివేనా? అసలు మాట్లాడలేవా?" అని అడి

గాను. ఆపిల్ల బదులు పలకలేదు. కాగితాలు సర్దుకుంటూ నిలబడింది. ఎవరూ పైసలివ్వక పోవడంతో పక్కకు పోదామని కదలబోయింది.

నేను వదలలేదు. ఆ పిల్ల చెయ్యి పట్టుకుని "అడుగుతుంటే జవాబు చెప్పవేం? నువ్వు నిజంగా మూగపిల్లవేనా?" అని అడిగాను.

ఆ పిల్ల నోరు తెరిచి చూపించింది, తర్వాత మాట్లాడలేనని సంజ్ఞలు చేసింది.

నేనా పిల్లను వదలకుండా పెద్దగా "కాదు....నువ్వు మూగదానివి కాదు....మాట్లాడగలవు....మాట్లాడు....లేకపోతే వచ్చే స్టేషన్‌లో పోలీసులకు పట్టిస్తాను." అని బెదిరించాను.

ఆ పిల్ల ముందు భయంగా చూసింది. తర్వాత ఉన్నట్టుండి పెద్దగా ఏడుపు ప్రారంభించింది.

నేను అదిరి పడ్డాను. ఆ పిల్లచెయ్యి వదిలి వేశాను. అప్పటికే అందరూ నావంక తీక్షణంగా చూస్తున్నారు. నుదుట పట్టిన చెమటను తుడుచుకుంటూ ఆందోళనలో పడ్డాను. తర్వాత ఆ పిల్లతో "ఏడవకు....నీ పేరేమిటో చెప్పు చాలు....చెబితే పావలా యిస్తాను. చెప్పక పోతే పోలీసులకు పట్టిస్తాను!" అన్నాను.

ఆపిల్ల యింకా పెద్దగా ఏడవటం ప్రారంభించింది. దానితో చిత్రమైన అవస్థలో పడ్డాను. మొదట్లోనే ఊరుకున్నా సరిపోయేది. "అనవసరంగా ఈ యిబ్బందిలో పడ్డామే" అనిపించింది.

అప్పటికి అక్కడి మనుష్యులలో మార్పు వచ్చింది. కిటికీపక్కన కూర్చునివున్న ముసలాయన "ఇంక ఆ పిల్లను వొదిలేయండి బాబూ! పాపం! ఇప్పటికే భయపెట్టేశారు, మీరెవరో భలేవారేనండీ మొత్తానికి...." అంటూ జేబులోనుంచి డబ్బులుతీసి ఆ పిల్లచేతిలో పోశాడు.

దాంతో ఆపడుచు దంపతులూ, వృద్ధ దంపతులూ. సూట్ వాలా, విద్యార్థి, నా పక్కన నడి వయసు అసామీ, అందరూ చేతికందినన్ని చిల్లర డబ్బులు ఆ పిల్ల చేతిలో పోశారు.

ఆ పిల్ల ఏడుస్తూనే వినయంగా అందరి దగ్గరా డబ్బులు తీసుకున్నది. తర్వాత వెక్కుతూనే పక్కకుపోయింది. ఇక్కడ జరిగిన విషయం అప్పటికే అక్కడికి ప్రాకిపోయింది. 'ఎవరో పెద్దమనిషి ఈ అడుక్కునే మూగపిల్లను నానా హింసలూ పెట్టాడుట!!' అని ఒకరికొకరు చెప్పుకున్నారు. ఆపిల్ల ఇంకా ఏడుస్తూనే ఆ పెద్దరైలుపెట్టెఅంతా తిరిగింది. అందరూ తోచినంత చిల్లర యిచ్చివుంటారు. తర్వాత డబ్బులన్నీ మూటకట్టుకుని రాస్తేపు కిటికీ దగ్గర నిలబడింది.

నాకు కణకణలాడే నిప్పులమీద కూర్చున్నట్టనిపించింది. అనవసరంగా ఎటోవెళ్ళే ఖర్మాన్ని కాళ్ళకు చుట్టుకున్నట్టయింది. మనసంతా విచారంతో, అవమానంతో. బాధతో, నిండిపోయింది. అంత గాలిలోనూ నుదుట మాటి మాటికి చెమట పట్టింది. ఎవరి మొహంలోకీ చూడలేక చూపులు దించుకున్నాను. నా చుట్టూ ఉన్నవారి చూపులలో అర్థం మారింది, అందరూ నన్నొక రాక్షసుడిక్రింద, విలన్ క్రింద జమకట్టి చూస్తున్నారు. అయ్యో దేవుడా! పొద్దున్నేలేచి ఎవరి మొహం చూశానోకదా; నేరకపోయి యిటువంటి ఘోరమైన సంఘటనలో చిక్కుకుపోయాను.

రైలు వేగం తగ్గింది. నేను దిగవలసిన చిన్న స్టేషను వస్తున్నది. నేను నిట్టూర్చి ఎవరివంకనూ చూడకుండా లేచి సంచి అందుకుని వచ్చి గుమ్మందగర నిలబడ్డాను, బండి ఆగగానే ప్లాట్‌ఫారంమీదికిదూకి త్వరత్వరగా వెళ్ళి గేటులో టిక్కెట్టుయిచ్చి. అవతలవైపుకు వెళ్లాను. అక్కడ కటకటాల పక్కనే రిక్షాకోసం ఎదురుచూస్తూ ఒక్కక్షణం నిలబడ్డాను. రైలు కదలబోతూ కూతవేసింది.

అంతలో కటకటాల అవతలనుంచి "ఏమండీ" అని పిలుపు విని పించింది. జేబురుమాలతో నుదురు తుడుచుకుంటూ వెనుదిరిగి చూశాను. ఆ మూగపిల్ల .... కటకటాలనానుకుని నిలబడివుంది. అదోరకంగా నవ్వింది. "మీదయవల్ల నాకీపూట మూడు రూపాయలు దొరికాయి" అన్నది.

నేను చిత్రిత ప్రతిమలా నిలచిపోయాను.

అంతలో రైలు మళ్ళీ కూతవేస్తూ కదిలింది. ఆ పిల్ల త్వరత్వరగా పరుగెత్తుకువెళ్ళి కదులుతున్న రైలులో ఎక్కి చెయ్యివూపింది.

నా చొక్కామీద మరకవంక చూసుకున్నాను. "అరె మల్లెపువ్వులా వున్న తెల్లని చొక్కామీద యీ మరక ఎలాపడిందబ్బా?" అనుకున్నాను. దూరంగా సూర్యుడస్తమిస్తున్నాడు. నేను నడక సాగించాను.

——///——